క్లుప్తంగా

బంగారు వర్ణ బల్లి



గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలో సోమవారం అలీ కిరాణం, కూల్ డ్రింక్ షాప్‌లో బంగారు పూత కలిగి తెలుపు, నలుపు మచ్చలు కలిగిన బల్లి కనిపించింది. షాపు యజమాని రహీంబాషా సరుకుల బస్తాలు సర్దుతుండగా ఈ కొత్త రకం బల్లి కనిపించింది. ఇలాంటి బల్లి ఇంతవరకు ఈ ప్రాంతంలో కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. బల్లిని చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపారు.

పట్టణ సుందరీకరణకు కృషి చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సుందరీకరణ పనులపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణ అభివృద్ధి, సుందరీకరణ పనులపై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, నీరజ, విక్టర్ తదితరులతో సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని పార్కులను మరింత అభివృద్ధి చేయాలని, అంతర్గ రోడ్ల విస్తరణతో పాటు వీధి దీపాల ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకై మైనారిటీ కాలనీలో ఈనెల 18వ తేదీన 10వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ బేబి, ఏఈలు శరత్‌చంద్ర, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు

ఆదోని టౌన్: పట్టణంలోని భీమాస్ సర్కిల్‌లో మెయిన్ పైపులైన్ లీకేజీ మరమ్మతులు సోమవారం పూర్తయ్యాయని వాటర్ వర్క్స్ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా మెయిన్‌రోడ్డులో మెయిన్ పైపులైన్ పగిలిపోవడంతో తాగునీరు వృథా అవ్వడంతో పాటు ట్రాఫిక్ సమస్య పెరిగిపోయి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా పట్టణంలో చాలా వీధుల్లో పైపులైన్ల లీకేజీ అవుతున్నాయని, సకాలంలో మరమ్మతులు చేసి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టిడ్కో ఇల్లు మంజూరు చేయాలి

ఆదోని టౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో నివాసముంటున్న దివ్యాంగురాలు మహాదేవి తనకు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, టిడ్కో మెయింటెనెన్స్ అధికారి శివశంకర్‌కు అర్జీని అందజేశారు. ఈ విషయంపై శివశంకర్‌ను సంప్రదించగా కరెంట్‌బిల్లుకు ఫోన్ నంబర్, ఆధార్‌కార్డుతో లింక్ కావడం వల్ల కాస్త ఆల్యమయ్యిందని, త్వరితగతిన ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు: మాచాని సోమప్ప మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పేద విద్యార్థులకు ఉచిత పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. పట్టణంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సీబీఎస్‌ఈ, నాన్‌సీబీఎస్‌ఈ, తెలుగు అకాడమిలకు చెందిన రూ.15లక్షలు విలువచేసే పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంఆర్ రమేష్, డాక్టర్ మాచాని సోమనాథ్, ఎంఆర్ గంగాధర్‌రావు, ఎస్ తారకేష్, కేఏస్పీ శివన్న, చారిటీ సభ్యులు కుర్ణిదైవాచార సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి రూ.50వేలు విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం ఓ భక్తుడు విరాళం అందజేసి తన భక్తిని చాటుకున్నాడని ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.వెంకటేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం మాన్వి పట్టణానికి చెందిన విక్టరి ఆనంద రావు కుటుంబ సభ్యులతో కలిసి రూ.50,000లను దేవాలయ కార్యాలయంలో అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జున, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక మృతికి కారకులను శిక్షించాలి

గోనెగండ్ల : పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో 8 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్యచేసిన నిందితులను వెంటనే శిక్షించాలని రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పోతులపాడు నాగరాజు డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్, రాయలసీమ యువ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారిపై ధర్నా చేశారు. నాయకులు పూర్ణ, దినకర్, సాధిక్, రవి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నిరాశేనా?

- రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఎన్నికల్లో కూటమి హామీ
- ప్రస్తుతం అధికారంలోకి వచ్చి నెలదాటినా ఆ ఊసే ఎత్తని ప్రభుత్వం
- 2014లో కాలయాపనతో సరిపెట్టిన చంద్రబాబు
- ఆందోళనలో యువత.. మాట నిలబెట్టుకోవాలంటున్న నిరుద్యోగులు



ఆదోని టౌన్/మంత్రాలయం/ఎమ్మిగనూరుటౌన్: ఇంటికో ఉద్యోగం.. రూ.3 వేలు నిరుద్యోగ భృతి.. బాబు వస్తే జాబు.. ఇదీ చంద్రబాబు 2014 మేనిఫెస్టో.. యువతను మభ్య పెట్టి గద్దెనెక్కారు. పీఠంపై కూర్చోగానే హామీలకు కొరివి పెట్టేశారు. నాలున్నర ఏళ్ల కాలయాపన చేసి భృతి భ్రమలో యువతను నిలబెట్టారు. 2019 ఎన్నికలకు ఐదు నెలల ముందు అరకొరగా భృతి ఇచ్చేసి చేతులు దులుపుకున్నారు. 2024 ఎన్నికల్లోనూ ఇదే మంత్రం పాటించారు. ఇంటికో ఉద్యోగం లేదా ప్రతి నిరుద్యోగికి రూ.3 వేలు ఇస్తామని హామీ గుప్పించారు. నిరుద్యోగులు కూటమి ఇచ్చిన హామీ నెరవేరుతుందన్న ఆశతో అప్పులు చేసి మరీ ఉద్యోగాల కోసం కోచింగ్‌లు తీసుకుంటూ కాలం గడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేబూని నెల దాటినా నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. దీంతో నిరుద్యోగ యువతలో ఆందోళన మొదలైంది.

స్థానికంగా ఉపాధి అవకాశాలు తక్కువ

మంత్రాలయం నియోజకవర్గంలో మొత్తం 94 సచివాలయాలు ఉన్నాయి. 2.80 లక్షల జనాభా ఉంది. అందులో నిరుద్యోగులు 16 వేలకు పైగా ఉన్నట్లు అంచనా. కూటమి అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉపాధి, రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. ఆదోని పట్టణంలో దాదాపు 35 వేలకుపైగా ఇళ్లు ఉన్నాయి. ఇంటికొక ఉద్యోగమన్నా సుమారు 30 నుంచి 40 వేల మంది దాకా నిరుద్యోగులు ఉంటారు. హామీలను నమ్మి చాలా మంది యువత కూటమికి పట్టం కట్టారు. అక్షరాస్యతలో వెనకబడిన మంత్రాలయం నియోజకవర్గంలో పెద్దగా ఉపాధి అవకాశాలు లేవు. ఇస్పాత్ మారుతి ఉక్కు కర్మాగారం, ఆదాని విల్‌మార్ ఫ్యాక్టరీల్లోనూ స్థానికేతరులు ఎక్కువగా పనిచేస్తున్నారు. ఉక్కు ఫ్యాక్టరీలో ఎక్కువగా ఇతర రాష్ట్రాల యువత పనిస్తోంది. దీంతో ఉద్యోగాలు లభించని నిరుద్యోగులు ప్రభుత్వం కల్పించే భృతి పైన ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికీ ప్రభుత్వం నుంచి భృతిపై క్లారిటీ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి ఇస్తుందో.. లేక 2014లో మాదిరి చేస్తారోనన్న ఆందోళన యువతలో నెలకొంది.

కోచింగ్ సెంటర్లలో యువత

ఎమ్మిగనూరు పట్టణంలోనే వందలాది మంది నిరుద్యోగ అభ్యర్థులు కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. పట్టణంలో 23,617 ఇళ్లు ఉండగా వాటిలో 50శాతం ఇళ్లలో ఇంటికో నిరుద్యోగి ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి. 2014 నుంచి 2019వరకు రాష్ట్రాన్ని ఏలిన టీడీపీ నిరుద్యోగ భృతి ఇస్తామని చేతులెత్తేసింది. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి కల్పిస్తుందేమోనన్న అనుమానాలు సైతం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా అమలు చేయాలి



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్యోగం లేదా నిరుద్యోగభృతి ఇస్తారని ఎంతగానో ఎదురుచూస్తున్నాం. సీఎంగా అధికారం చేపట్టి 50 రోజులు కావొస్తోంది. నిరుద్యోగుల అవస్థలు, ఇబ్బందులను గుర్తించి తమను ఆదుకోవాలి. ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. యువతలో కొత్త ఉత్సాహం నింపాలి. నిరుద్యోగ యువతకు అండగా నిలవాలి.

– మహేష్‌కుమార్, నిరుద్యోగి, హనుమాన్‌నగర్

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులైంది. నిరుద్యోగ భృతి గురించి నేటికి ఎలాంటి ప్రకటన లేదు. నేను ఎంఏ బీఈడీ చేశా. వయస్సు 32 ఏళ్లు. ఉద్యోగ వేటలో ఉన్నా. ఈ కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామంటే ఎంతో ఆశించాం. ఎదురుచూస్తున్నాం. ఎప్పటి నుంచి అమలు చేస్తుందోనని ఎదురుచూడాల్సిన పరిస్థితి.

–వీరేష్‌యాదవ్, ఎమ్మిగనూరు

ఉపాధి లేక ఇబ్బందులు



ఉపాధి లేకపోవడంతో అంగళ్లు, కిరాణాషాపుల్లో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రస్తుతం ఓ ఫొటో స్టూడియోలో పనిచేస్తున్నా. వేతనాలు చాలడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగభృతి ఇచ్చి ఆదుకోవాలి. నిరుద్యోగుల సమస్యలను గుర్తించి, వారికి ఉపాధి కల్పించాలి. – రుద్రకుమార్, హవన్నపేట, నిరుద్యోగి

ఆంక్షలు లేకుండా చూడాలి



నిరుద్యోగ భృతి విషయంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా చూడాలి. 25–35 ఏళ్ల లోపు యువతకు భృతి ఇస్తారని సమాచారం. ఇలా చేస్తే లక్షలాది మంది యువతకు అన్యాయం జరిగేలా ఉంది. డిగ్రీ లేదా సమాన కోర్సు పూర్తి చేసుకున్న ప్రతి నిరుద్యోగ యువతకు రూ. 3 చొప్పున భృతి చెల్లించాలి. – ఉజ్జన్న, పెద్దకడబూరు

ఇబ్బందులు పడుతున్నాం



డిగ్రీ పూర్తి చేసుకున్నాం. నిరుద్యోగభృతి కోసం ఎదురుచూస్తున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు నిరుద్యోగభృతి ఇస్తామని హామీ ఇచ్చారు. త్వరితగతిన నిరుద్యోగభృతిని అందించాలి. ఉపాధి లేక ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నిరుద్యోగభృతి వల్ల కొంతమేర అయినా తమకు సాయ పడుతుందని భావిస్తున్నాం. – నరసింహులు, నిరుద్యోగి, ఆదోని పట్టణం

మాట నిలబెట్టుకోవాలి



నేను బీఎస్సీ బీఈడీ చదువుకున్నాను. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ప్రభుత్వం తమ లాంటి నిరుద్యోగుల కోసం నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ ఇచ్చింది. హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. లేదంటే నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. – రంగన్న, కోసిగి

అమలు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది



రెండేళ్ల క్రితం నేను డిగ్రీ పూర్తి చేసుకున్నాను. ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సమాయత్తం అవుతున్నాను. మా అమ్మానాన్నలు వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించారు. ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లిస్తే తమలాంటి యువతకు ఉపయోగకరంగా ఉంటుంది. చదువుకునేందుకు వెసులుబాటు లభిస్తోంది. – బసవరాజు, కౌతాళం

నమ్మకం కుదరడం లేదు



2014లో ఇదే మాదిరి నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అప్పట్లో చివరి నెలల్లో అరకొరగా నిరుద్యోగ భృతి ఇచ్చారు. తక్కిన యువతకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఇప్పటి వరకు నిరుద్యోగభృతిపై ఎలాంటి మార్గదర్శకాలు వెలువరించలేదు. ఈ నేపథ్యంలో భృతి అమలుపై నమ్మకం కుదరడం లేదు. ఇకనైనా ప్రభుత్వం నిరుద్యోగ భృతి చెల్లించాలి. – నరసింహులు, కౌతాళం

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపండి

- గడువులోపు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోండి
- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్సెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌డీఓ నాగేశ్వర రావు, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ, ఆర్టీఓ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని...

- ఆదోని మండలం సలకలకొండ గ్రామానికి చెందిన ఈరన్నకు సంబంధించి సర్వే నంబర్ 144లో 3.98 ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో 2.56 ఎకరాలు మాత్రమే ఉందని, మిగిలిన 1.46 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అర్జీ సమర్పించాడు.
- నందవరం మండలం నాగలదిన్నె గ్రామానికి చెందిన వలిసాబ్‌కు సంబంధించి గొనెగండ్ల గ్రామంలో సర్వేనంబర్ 752/3లో 3.72 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. ప్రస్తుతం సదరు భూమిని ఆన్‌లైన్లో నమోదు చేయాలని అర్జీ ఇచ్చాడు.
- ఆదోని మండలం కల్లుబావి గ్రామంలో మల్లయ్యకు సంబంధించి సర్వేనంబర్ 290లో 0.25 ఎకరాల భూమి ఉందని, ప్రస్తుతం సదరు భూమిపై పీఎం కిసాన్ నగదు, నష్టపరిహారం అందడంలేదని, మంజూరు అయ్యేలా చూడాలని విన్నవించాడు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

సుంకేశ్వరిలో ఇన్‌చార్జ్ కలెక్టర్ పర్యటన



గ్రామస్తులతో వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణస్వామి సోమవారం పర్యటించారు. అతిసార వ్యాధి బారిన పడి గ్రామానికి చెందిన జ్యోతి అనే బాలిక మృత్యువాత పడగా.. 50 మందికి పైగా వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న జేసీ, సబ్ కలెక్టర్ గ్రామంలో పర్యటించి అతిసారం ప్రబలడానికి కారణాలు తెలుసుకున్నారు. గ్రామంలో మృతిచెందిన చిన్నారి కుటుంబ సభ్యులను, అతిసారం బాధితులను పరామర్శించారు. గ్రామంలో తాగునీటి పరీక్షలు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అతిసార విస్తరించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించాలని, వైద్యులు అందుబాటులో చికిత్సలు చేయాలని సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వర రావు, డీపీఓ నాగరాజునాయుడు, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, వైద్యాధికారి సురేష్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ఆదోని అర్బన్: అతిసారా వ్యాధి బారినపడి ఆదోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మంత్రాలయం మండలం సుంకేశ్వరి గ్రామస్తులను సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారికి ఎలాంటి చికిత్స ఇస్తున్నారని వైద్యులను ఆరా తీశారు. ఆమెతో పాటు వెంట ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరురూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిని సందర్శించారు. డయేరియాతో బాధపడుతున్న మంత్రాలయం మండలం సుంకేశ్వరి నరసప్ప, నందవరం మండలం కనకవీడుకు చెందిన లక్ష్మి, పట్టణంలోని ఇంద్రానగర్‌కు చెందిన లక్ష్మిలను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఆర్‌ఐ లక్ష్మన్న, వీఆర్వో షేక్షావలి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బాలజీకుమార్ ఉన్నారు.

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి సన్నిధికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

కుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలి

ఆదోని సెంట్రల్/ఆదోని టౌన్: పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. పట్టణంలో చాల మంది వీధికుక్కల దాడులతో గాయపడి ఆసుపత్రి పాలయ్యారన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌస్ నాయకులు నాగరాజు, శశిధర్, లోకేష్, రాజు, ఇమ్రాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాటివనం వేలం పాటలు

ఆదోని సెంట్రల్: ఆదోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్నత కుప్పగల్ బీట్ నౌలాకల్ తాటివనంలో తాటి ముంజలు(కాయలు), చనిపోయిన లేదా గాలికి పడిపోయిన తాటి ఆకులు సేకరించుకునేందుకు మంగళవారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆదోని ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజశ్విని సోమవారం తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.వెయ్యి ధరవాతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కౌలు కార్డుతో ప్రయోజనం

గోనెగండ్ల : పంట సాగు హక్కు పత్రాల (కౌలుకార్డు) వల్ల కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని తహసీల్దార్ పార్వతి, ఏఓ హేమలత తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలకు కౌలు కార్డులపై సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట సాగు హక్కు పత్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కౌలు రైతులు వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సుబ్బారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: హాస్టల్‌లో ఉంటేనే విద్యార్థులకు సీటు ఇస్తామని పట్టణంలోని నర్సింగ్ ఒకేషనల్ నేషనల్ స్కూల్ యాజమాన్యం చెప్పడం దారుణమని, వెంటనే కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ధణాపురం ఉదయ్ కోరారు. ఈ మేరకు సోమవారం ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. ఉదయ్ మాట్లాడుతూ ఆదోనిలోని నర్సింగ్ ఒకేషనల్ నేషనల్ స్కూల్‌లో ఫీజుల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు వినీల్, మండలాధ్యక్షుడు రాజ్ కుమార్, సూరి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఆదోని టౌన్: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ బాబురాజు సూచించారు. స్థానిక అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సీజనల్ వ్యాధులు, టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు జ్ఞానేశ్వరిదేవి, శశికళ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో యువకుడి హంగామా

ఆదోని అర్బన్: ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గుర్తు తెలియని యువకుడు మద్యం మత్తులో సోమవారం హంగామా చేశాడు. బయట నుంచి తలకు గాయం చేసుకొని ప్రభుత్వాస్పత్రికి వచ్చి చికిత్స పొందాడు. అనంతరం మద్యం మత్తులో ఆస్పత్రి బయట ఉన్న పరిసరాల్లో ద్విచక్ర వాహనాలను తన్నుతూ, కిందకు పడేసి కేకలు వేస్తూ వీరంగం సృష్టించాడు. ఆస్పత్రిలోని రోగులు, రోగుల కుటుంబ సభ్యులు, డాక్టర్లు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి యువకుడిని ఒకచోట కూర్చోబెట్టారు. మద్యం మత్తు దిగిన వెంటనే ఆ యువకుడు వెళ్లిపోయాడు.

ప్రభుత్వ వైఫల్యంతోనే అఘాయిత్యాలు

నందవరం : కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో అఘాయిత్యాలు పెరిగిపోయాయని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు వెంకటేష్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయనగరంలో 8 ఏళ్ల బాలికపై, నంద్యాల జిల్లాలో వాల్మీకి చిన్నారిపై అత్యాచార ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం లా అండ్ ఆర్డర్ విషయంలో వైఫల్యమైందని విమర్శించారు. ప్రభుత్వం మేలుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.

విద్యార్థి సమస్యలపై పోరాటం

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థి సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పోరాటం చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి అన్నారు. సోమవారం పట్టణ ఏబీవీపీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా వంశీ, సహాయ కార్యదర్శులుగా పవన్, మల్లికార్జున, ఉమేష్ ఎన్నికయ్యారు.

రిటైర్డ్ సైనికుడికి సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న స్థానికులు

ఎమ్మిగనూరుటౌన్: 22 సంవత్సరాల పాటు బీఎస్ఎఫ్‌లో పనిచేసి దేశానికి సేవలందించి పదవీ విరమణ పొందిన పట్టణానికి చెందిన బండా సత్యనారాయణను సోమవారం స్థానిక బాలుర జూనియర్ కళాశాలలో పట్టణ వాసులు ఘనంగా సత్కరించారు. ఆయనకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వహబ్, రంగస్వామి, రామకృష్ణ, హెచ్ఎం లచ్చప్ప, డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఉపాధ్యాయులు కుమార్, వెంకటేష్, రహిమాన్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి



నాగలదిన్నె లక్ష్మయ్య(ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని చిన్న భూంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు నాగలదిన్నె లక్ష్మయ్య అలియాస్ జోల్లయ్య(53) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన గ్రామంలో వైఎస్సార్‌సీపీ నుంచి రెండు పర్యాయాలు ఎంపీటీసీగా గెలుపొందాడు. ఆయన మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని లక్ష్మయ్య మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. మృతినికి భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ ఉసేని, నాయకులు నాడుగేని నాగరాజు, నాడుగేని వీరేష్, దొడ్డి నరసన్న, వందగల్లు లక్ష్మయ్య, మల్లికార్జునగౌడ తదితరులు నివాళులర్పించారు.



మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

జీపీఎస్ గెజిట్‌ను ఉపసంహరించుకోవాలి



ఆదోనిలో నిరసన తెలుపుతున్న ఏపీ ఎంటీఎఫ్ నాయకులు



నిరసన తెలుపుతున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు బసవరాజు, కోటన్న డిమాండ్ చేశారు. సోమవారం ఏపీఎంటీఎఫ్ నాయకుల సమావేశం పురపాలక పాఠశాలలో జరిగింది. వారు మాట్లాడుతూ జీపీఎస్ విధివిధానాలను విడుదల చేయకుండానే అమలుపై గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. ఏపీఎంటీఎఫ్ నాయకులు సురేష్ కుమార్, బసవరాజు, ప్రతాప్ రెడ్డి, నూరుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలు తప్పవు

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అవలంబిస్తే పోరాటాలు తప్పవని ఎస్టీయూ రాష్ట్ర సహఅధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు హెచ్చరించారు. సోమవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విజయ్, శ్రీరాములు, మల్లికార్జున, నాగేంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పంపింగ్ త్వరగా పూర్తి చేయండి

ఆదోని టౌన్: రాంజల నల్లచెరువులోని పాచిపట్టి రంగుమారిన నీటిని తోడేసే పనులు (పంపింగ్) త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. వర్షాలు కురుస్తున్నాయని, వర్షం ద్వారా వచ్చే నీటిని చెరువులను నింపుకునేందుకు వీలుగా రా వాటర్ పంపింగ్ పూర్తి చేయాలన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ రాంజల నల్లచెరువులో నీటి పంపింగ్ పనులను పరిశీలించారు. చెరువులో ఉన్న ముళ్లపొదలు, కంపచెట్లు, వ్యర్థ పదార్థాలను పూర్తిగా తొలగించే పనులు దాదాపుగా పూర్తి అయ్యాయన్నారు. ఆయన వెంట ఎంఈ చలపతిరావు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గుండమ్మ హంతకులను కఠినంగా శిక్షించాలి

గోనెగండ్ల : నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ మాల గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి హత్యచేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహాదేవ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ పార్వతికి వినతిపత్రం అందజేశారు. గుండమ్మను హత్య చేసిన శ్రీధర్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి, బోయ రామకృష్ణ, గోవిందల్‌ను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మ్మార్పీఎస్ నాయకులు నాగేశ్వర రావు, మాదన్న, జగన్, పవన్, పెద్ద రంగన్న, మహేష్ పాల్గొన్నారు.